# నిమిషం

## ఇంద్రగంటి శ్రీకాంతశర్మ

అలిసిపోయి, బడలిన కళ్లతో ఒకరు; అసహనంతో ఎరుపెక్కిన కళ్లతో మరొకరు.

ఎదురెదురుగా నిలుచున్నారు. నిజానికి ఆ యిద్దరూ అలా ఎదురుకావలసినవాళ్లు కారు. అయితే పరిస్థితి అలా ఏర్పడింది.

"ఇది ఇలా జరగవలసిందికాదు"

"నిజమే! కాని, జరగవలసివచ్చింది!"

"నన్ను అడిగి వున్నావుకదా! వేచి ఉండవచ్చునే!!"

"నిజమే! వేచివుండమని మీరు ఆశావహంగా చెప్ప లేదు కద!"

"శిష్యుడివి, గురువు అనుగ్రహించే వరకు ఎదురు చూడాలి"

"నిజమే కాని, ఆశ ఏమీలేకుండా ఎంతకాలం?"

"కాలం కలిసి వచ్చేవరకు"

"కాలం ఆగదు కద!"

"ఆగలేనంతటి తొందర ఏమి వచ్చింది?"


"కాలం కలిసివచ్చింది. పన్నెండేళ్ల కాలం!"

"కాలం, పన్నెండేళ్లా, అయిదువేల ఏళ్లా అని అడగడం లేదు. తర్కించవద్దు. నువ్వు నన్ను కాదని, వేరొరిని నాకిష్టమైన పనికి నియోగించి, గొప్పతప్పు చేశావు. నీ పని పూర్తి కావడమే చూసుకున్నావు. వంశ గురువుని అవమానించావు!"

"మన్నించాలి. అలవికాని నిద్ర నన్ను ఆవరించింది. అందుకే మీరు వచ్చారని నా వాళ్లు నాకు చెప్పడానికి సమయం పట్టింది. తెలిసిందే తడవుగా మీ దర్శనానికి వచ్చాను. లోపలికి దయచేయండి"

"ఇంక అంగలార్పులువద్దు. నువ్వు జీవించే అర్హత పోగొట్టుకున్నావు"

"మంచిది; అయితే ఇది విను. నువ్వు ఋషిగా పరిగణించదగిన అవకాశాన్ని నీ క్రోధం వల్ల పోగొట్టుకున్నావు."



"నీలో చైతన్యం తొలిగి, శవంగా పడి వుండు."

"నీకూ అదే గతి"

ఇద్దరూ నేలమీద కుప్పకూలి పోయారు.

***

దేనిని సృష్టించాలన్నా కావలసిన రాజసం గలవారొకరు;

వట్టి 'గాలి'గా మాత్రం మిగిలిన వారొకరు;

ఎదురెదురుగా నిలుచున్నారు–

పరిస్థితి అలా ఏర్పడింది.

"నాన్నగారూ, నాకిప్పుడొక శరీరం కావాలి"

"ఎందుకు? జరగవలసింది జరిగి, పోదగిన శరీరం పోయిందికదా!"

"పనులన్నీ నిలిచిపోయాయి. నాకు శరీరం కావాలి"

"నీకు తెలియనిది కాదు; శరీరం ఊరికే పుట్టుకురాదు. స్త్రీ పురుష భావాలు కలవాలి. రేతస్సు, రక్తం కలవాలి. సమయం రావాలి. శరీరం ఏర్పడాలి."

"నాన్నగారూ, నాకు శరీరం కావాలి."

"అలాగే! అయితే జాగ్రత్తగా విను. మనస్సే ప్రాణం. దాన్నొక విత్తనంగా చేసి నాటాలి. నీ శరీరంగా అది మొలిచేసందర్భం మాత్రం, అందరి మనుషుల్లాగా వుండదు."

"నాన్నగారూ, నాకు శరీరం కావాలి. పనులు నిలిచిపోయాయి."

"అలాగే వెళ్లు"

ఆ'గాలి' వెళ్లిపోయింది.

***

నిశ్చేష్టులై నిలబడి పోయిన వారందరూ, ఒకవైపు చూస్తున్నారు.

అక్కడొక శరీరం వుంది. నిజానికి శవం అనాలి. దానిని, బాధ్యతతో గౌరవంతో, అలంకరించి సుగంధద్రవ్యాలు పూసి వారందరూ రక్షించారు.

ఆ శరీరం యోగ నిద్రాముద్రతో నిశ్చలంగా, నిర్వికారంగా, వుంది. రాజ వైభవం ఇసుమంత కూడా తగ్గలేదు.

వారందరి మధ్యనించి ముందుకు వచ్చి, గొప్ప ఆకర్షణ గల వ్యక్తి, ఆ శవంతో అన్నాడు –

"జరగవలసింది జరిగినప్పుడు, దానికి కారణం స్పష్టంగా తెలిసినప్పుడు, విచారించకూడదు అవునా?"

"అవును" అంది, ఆ శవాన్ని చూస్తూ, దానిపైనే తిరుగుతున్న 'గాలి'

"నీ దోషంలేదు. నీ గురువు వెళ్లి పోయాడు, ఆకాశంలోకి గాలిగా తేలి! నీ మనస్సుని ఈ నీ శరీరంలోకి తెస్తాను ఇష్టమేనా?"

"వద్దు"

"అయ్యో! ఇది నీదేశం. నువ్వు పరిపాలకుడివి. నువ్వు లేక పోతే, పనులన్నీ నిలిచిపోతాయి"–

"పోవు. నా ముందరి పాలకులు పోయినప్పుడు, నేనున్నాను. ఇప్పుడు నేను లేకపోతే, మరొక పాలకుడుంటాడు"–

"మరి స్వర్గానికి వెళ్లాలనా?"

"వద్దు"

"అయితే ఈ శరీరసంబంధం వద్దనే నిర్ణయమా?"

"నిశ్చితంగా–"

అందరూ నిశ్చేష్టులయే ఉండిపోయారు. ఎవరూ ఏమీ చెప్పలేని స్థితి–

ఇంతలో ఒక గంభీర కంఠం అందరికీ వినిపించింది. ఆ కంఠం ఆ శవాన్ని ఉద్దేశించి పలికింది.

"సంతోషం. నీ మనస్సే ప్రాణం. 'గాలి'గా, నీ శవం మీదనే తిరుగుతోంది. ఎందుకు?"

"నాకీ లోకాన్ని వదలాలనిలేదు"

"అదే, ఎందుకు? ఎలాగ?"

"ప్రాణులు నాకిష్టం. పరిపాలన నా కిష్టం. ప్రాణులు పడే అవస్థలు, అలసట, నాకు తెలుసు. నగరాల్లో పల్లెల్లో, కొండల్లో, అడవుల్లో, నదుల్లో... ఇక్కడా అక్కడా అనేమిటి? లోకం అంతటా... పని. పని. పని. ఒకటే అలసట. ఆ అలసట తీర్చాలి."

"అందుకని?"

"ప్రాణులన్నిటికీ, మనుషులకీ.... చూసి. చూసి. చూసి. చూసి కళ్లు అలసిపోతూంటాయి. కళ్లు, అలా అలా చూసే చూపుతో మెలమెల్లగా కళ్ల రెప్పలు ముడుచుకుంటాండాలి.

ఆ అల్పాల్ప విశ్రాంతి ఇవ్వాలనివుంది."

"అందుకని?"

"నాకు శరీరం వద్దు. ఇలా 'గాలి'గానే వుంటాను. ప్రాణులందరి కళ్ల రెప్పలమీద మంద మందంగా సంచరించాలనివుంది"

అంతే! "తథాస్తు" అంది కంఠం.

అయిన వాళ్లందరూ శవానికి దహన సంస్కారాలు జరిపించారు.

***

అప్పటి నుంచి, ప్రాణుల రెప్పపాటుకి, ఆ పాలకుడి పేరుమీదుగా, 'నిమిషం' అని వ్యవహారం వచ్చింది.

"ఋషికి శరీరం కావాలనిపించింది.

రాజుకి శవం అక్కర్లేదనిపించింది!"

"ఎవరు జ్ఞాని?"

"ఇద్దరూ అజ్ఞానులే"

"అంటే?"

"ఇద్దరూ బంధితులే"

"ఏమో?!"

"ఆలోచించు!"